ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి జిల్లా వార్తలు 5
సోమవారం 24 మార్చి 2025

ఉష్ణోగ్రత : గరిష్ఠం 37.8 కనిష్ఠం 19.7

రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:34 (సోమవారం సాయంత్రం)
సహర్: 4:55 (మంగళవారం ఉదయం)



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య

స్వామినాథన్ సిఫారసులు

అమలు చేయాలి

చేవెళ్ల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కేంద్రంలోని మోదీ సర్కారు ఎమ్మెస్ స్వామినాథన్ సిఫారసులు అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య డిమాండ్ చేశారు. ఆదివారం చేవెళ్ల లోని అంబేడ్కర్ భవనంలో నిర్వహించిన రాష్ట్ర రైతు సంఘం జిల్లా నాలుగో మహాసభకు ఆయన హాజరై మాట్లాడారు. మోదీ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతులు, కార్మికులపై దాడులు పెరిగాయన్నారు. మోదీ సర్కారు పారిశ్రామికవేత్తలకు లక్షల కోట్లతో రాయితీలు ప్రకటిస్తూ పేదలపై పన్నుల భారం మోపుతుందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు పూర్తి స్థాయిలో రుణమాఫీ, రైతు భరోసా నిధులను వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామకృష్ణారెడ్డి, జిల్లా గౌరవ అధ్యక్షుడు రాంరెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి, ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభులింగం, కౌన్సిల్ సభ్యుడు సుభాన్‌రెడ్డి, సుధాకర్‌గౌడ్, సత్తిరెడ్డి, సురధీర్, జంగయ్య, శ్రీనివాస్, ఏఐటీయుసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణచారి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్ల మంజుల, మోహన్‌రెడ్డి, చంద్రకళ, అన్నపూర్ణ, సత్యనారాయణ, వెంకటయ్య, మగ్బుల్ తదితరులు ఉన్నారు.



రిజర్వాయర్ నిర్మాణ ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు, ఇన్‌సెట్‌లో లక్ష్మీదేవిపల్లి గ్రామంలో మ్యాప్‌ను పరిశీలిస్తున్న అప్పటి మహబూబ్‌నగర్ కలెక్టర్ టీకే శ్రీదేవి (ఫైల్)

‘లక్ష్మీదేవి’

కటాక్షించేనా?

లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణంపై రైతన్నల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఇటీవల జరిగిన బడ్జెట్ సమావేశంలో రిజర్వాయర్‌ను నిర్మిస్తామనే మాట ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నోట రావడంతో ఈ ప్రాంత అన్నదాతల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ఇదే నిజమైతే దశాబ్దాల జలకల సాకారమై షాద్‌నగర్‌తో పాటు చేవేళ్ల, పరిగి, వికారాబాద్ నియోజకవర్గాల సాగునీటి కష్టాలు తీరనున్నాయి. త్వరితగతిన రిజర్వాయర్ నిర్మాణానికి నిధులు కేటాయించి పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

అసెంబ్లీలో లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ ప్రస్తావన

- రిజర్వాయర్‌ను సత్వరమే నిర్మిస్తామని ‘భట్టి’ హామీ
- బడ్జెట్‌లో నీటి పారుదల శాఖకు రూ.23,373 కోట్లు
- ప్రాజెక్టుపై రైతన్నల్లో చిగురిస్తున్న ఆశలు
- షాద్‌నగర్ ఎమ్మెల్యే కృషి ఫలితమేనని ప్రశంసలు

షాద్‌నగర్, మార్చి 22:(ఆంధ్రజ్యోతి) : షాద్‌నగర్ నియోజకవర్గానికి జలవనరులు లేక రైతన్నలు అష్టకష్టాలు పడుతున్నారు. కేవలం బోర్లు, బావుల మీదే ఆధారపడి వ్యవసాయం సాగిస్తున్నారు. జిల్లేడు చౌదరిగూడ మండలం లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణం చేపట్టాలని అన్నదాతలు దశాబ్దాలుగా డిమాండ్ చేస్తున్నారు. దీని నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంతమంతా సస్యశ్యామలంగా మారుతుందని ఎదురుచూస్తున్నారు. అయితే కేసీఆర్ తెలంగాణ ఉద్యమ సమయంలో, ఆ తర్వాత కూడా లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణం గురించి అనేక సార్లు ప్రస్తావించారు. కానీ పదేళ్ల అధికారంలో

మిగతా 8వ పేజీలో...

సమావేశాలు ముగియగానే దృష్టి సారిస్తా

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ముగిసిన తర్వాత లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణంపై దృష్టి సారిస్తా. గత పాలకుల నిర్లక్ష్యం వల్లనే నిర్మాణం జరగలేదు. త్వరలోనే పాలనాపరమైన అనుమతులు జారీచేసే అవకాశం ఉంది. రిజర్వాయర్‌కు ఎక్కడి నుంచి నీటి సరఫరా జరిపితే బాగుంటుందన్న విషయాలపై సంబంధిత శాఖ అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. నీటి పారుదల రంగానికి కేటాయించిన నిధుల్లో అధిక శాతం లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌కు కేటాయించాలని సీఎం రేవంత్‌ను కోరుతా. త్వరలోనే పనులు చేపట్టడానికి అవసరమైన డీపీఆర్‌ను రూపొందిస్తాం.

- వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్యే


కూరగాయల సాగుకు

ప్రోత్సాహం

జిల్లా ఉద్యాన శాఖ ప్రాజెక్టు అధికారి సురేశ్

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

యాచారం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కూరగాయలు, పండ్ల సాగు విస్తీర్ణం మరింత పెంచడానికి ప్రభుత్వం అనేక రాయితీలను అందిస్తుందని, ఇందుకోసం యాచారం మండలంలోని మొండిగౌరెల్లి, గడ్డమల్లాయగూడ, చౌదర్‌పల్లి గ్రామాలను పైలెట్ ప్రాజెక్టుగా తీసుకున్నామని ఉద్యాన శాఖ ప్రాజెక్టు జిల్లా అధికారి సురేశ్ తెలిపారు. మరికొన్ని వివరాలు ఆయన ‘ఆంధ్రజ్యోతి’తో పంచుకున్నారు.



ప్రశ్న: జిల్లాలో ఎన్ని ఎకరాలలో కూరగాయల సాగవుతుంది?

జవాబు: జిల్లాలో సుమారు 8వేల ఎకరాలలో కూరగాయలు సాగు చేస్తున్నారు.

ప్రశ్న: కూరగాయల సాగుకు ప్రభుత్వం ఎలాంటి రాయితీలు ఇస్తుంది?

జవాబు: ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం రాయితీ, సన్న చిన్నకారు రైతులకు 90 శాతం, ఇతర రైతులకు 80శాతం రాయితీపై డ్రిప్ అందిస్తున్నాం.

ప్రశ్న: కూరగాయల నారును ఎక్కడి నుంచి సరఫరా చేస్తారు?

జవాబు: అంటుకట్టిన వంగ నారు జీడిమెట్ల నుంచి రైతులకందిస్తాం.

ప్రశ్న: అంటుకట్టిన నారుకు ధర ఎంత ఉంటుంది.?

జవాబు: అంటుకట్టిన నారు హెక్టార్‌కు రూ.60 వేల ఖర్చు అవుతుంది. అయితే రైతుకు కేవలం రూ.24వేలకే అందిస్తున్నాం.

ప్రశ్న: పూలతోటలకు ఎలాంటి రాయితీలున్నాయి?

జవాబు: బంతి, చామంతి, గులాబీ, కనకాంబరం తోటలకు హెక్టారుకు నారు ఖర్చు రూ.50వేలు అయితే.. రెండు హెక్టార్లున్న రైతుకు రూ.20వేలకు నారు అందిస్తాం.

ప్రశ్న: నీటికుంటల నిర్మాణానికి రాయితీ ఎంతమేర ఇస్తున్నారు?

జవాబు: నీటికుంటల నిర్మాణానికి రూ.75వేల రాయితీ ఇస్తున్నాం.

ప్రశ్న : సేంద్రియ వ్యవసాయంపై ఎలాంటి ప్రోత్సాహం అందిస్తున్నారు?

జవాబు: సేంద్రియ ఎరువుల వాడకంపై రైతులకు ఆసక్తి పెంచడానికి యూనిట్ రూ. లక్ష ఉంటే రూ.50వేల రాయితీ ఇస్తున్నాం.

ప్రశ్న: మొండిగౌరెల్లి, చౌదర్‌పల్లి, గడ్డమల్లాయగూడ గ్రామాలను పైలెట్ ప్రాజెక్టుగా తీసుకోవడానికి కారణాలేంటి.?

జవాబు : ఈ గ్రామాలు నగరానికి సమీపంలో ఉన్నందున్న పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశాం.



ముళ్ల పొదల్లో

‘తెలుగు తల్లి’

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉన్నప్పుడు 2006లో షాద్‌నగర్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో తెలుగు తల్లి రాతి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆ విగ్రహం ఉందన్న విషయాన్ని అందరూ విస్మరించారు. దీంతో తెలుగు తల్లి విగ్రహం ముళ్ల చెట్లు, చెత్తాచెదారం మధ్య చిక్కుకుపోయింది. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోని ముళ్ల కంప మధ్యల నుంచి తెలుగు తల్లికి విముక్తి కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

షాద్‌నగర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి)



అప్రమత్తతే

శ్రీరామరక్ష

- క్షయతో తస్మాత్ జాగ్రత్త
- లక్షణాలు కనిపిస్తే పరీక్షలు తప్పనిసరి
- వ్యాధి నివారణకు కొత్త ఔషధం..
- అనంతగిరిలో టీబీ ఆస్పత్రి
- నేడు అంతర్జాతీయ క్షయ నివారణ దినం

7

జిల్లాలో పెరగనున్న

అసెంబ్లీ స్థానాలు



మాట్లాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్

- 24సీట్ల వరకు పెరిగే అవకాశం
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్
- మైలార్‌దేవ్‌పల్లిలో జిల్లా సన్నాహక సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న చల్లా వంశీచంద్‌రెడ్డి

రంగారెడ్డి అర్బన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : భవిష్యత్‌లో రంగారెడ్డి జిల్లాలో 24 అసెంబ్లీ స్థానాలు పెరగనున్నట్లు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. “జై బాపు, జై భీమ్, జై సంవిధాన్” అభియాన్ పేరుతో ఆదివారం రంగారెడ్డి జిల్లా మైలార్‌దేవ్‌పల్లిలోని గ్రాండ్ ఫంక్షన్‌హాల్లో జిల్లా సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అసెంబ్లీ స్థానాలు పెరిగితే మరి కొందరికి ఎమ్మెల్యేలు అయ్యే అవకాశం వస్తుందన్నారు. జిల్లాలో 24 సీట్లు పెరగడం అంటే మామూలు విషయం కాదన్నారు. రంగారెడ్డి, హైదరాబాద్ ప్రాంతంలో దాదాపు 48 సీట్లు అయ్యే అవకాశం ఉందని ఆయన తెలిపారు

గ్రామాల్లో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర : వంశీచంద్‌రెడ్డి

“జై బాపు, జై భీమ్, జై సంవిధాన్” అభియాన్ పేరుతో గ్రామ గ్రామాన రాజ్యాంగ పరిరక్షణ యాత్ర నిర్వహించాలని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి పార్టీ నేతలకు సూచించారు. మండలాన్ని యూనిట్‌గా తీసుకుని ఈ పాదయాత్ర నిర్వహించాలన్నారు. రూట్ మ్యాప్, ఏ గ్రామంలో ఏ రోజు పాదయాత్ర నిర్వహిస్తున్నారనే విషయాన్ని నిర్ణయించాలని తెలిపారు. అంబేడ్కర్, గాంధీ విగ్రహాలకు పూల మాలలు సమర్పించి యాత్ర ప్రారంభించాలన్నారు. మండలానికి ఒక కిట్ పంపించనున్నట్లు చెప్పారు. కిట్‌లో పార్టీ జెండా, గాంధీ, అంబేడ్కర్ చిత్ర పటాలు, రాజ్యాంగ పుస్తకం, కరపత్రాలు ఉంటాయన్నారు. ఇంటింటికీ, ఓటరును కలవాలన్నారు. ప్రతీరోజు ఉదయం రెండు గ్రామాలు, సాయంత్రం రెండు గ్రామాల్లో పాదయాత్ర పూర్తి చేయాలని తెలిపారు. ఉగాది, రంజాన్ లోపల మండలాల్లో సమావేశాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. పెద్ద గ్రామాల్లో ముగింపు సమావేశాలను నిర్వహించుకోవాలని తెలిపారు. పార్టీ సమావేశానికి డుమ్మా కొట్టిన మండల అధ్యక్షుల జాబితాను తనకు పంపించాలన్నారు. అధ్యక్షులు పనిచేయకుంటే కొత్తవారిని వెంటనే నియమించుకోవాలని చెప్పారు. పార్టీ కోసం పనిచేసే వారికి పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందన్నారు.

మల్‌రెడ్డి రంగారెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలి : డీసీసీ అధ్యక్షుడు

జిల్లాకు మంత్రి లేడని, ఈ పదవికి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నివిధాలా అర్హుడని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి తెలిపారు. మల్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని కోరుతూ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానిస్తున్నట్లు చెప్పారు. ఈ విషయాన్ని టీపీసీసీ అధ్యక్షుడు

మిగతా 8వ పేజీలో...

ఘనంగా మల్లన్న బోనాలు

మొయినాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని సురంగల్‌లో ఆదివారం మల్లికార్జునస్వామి బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి ఆదివారం గ్రామంలో గుడిలో స్వామి వారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు నెత్తిన బోనాలతో వచ్చి మల్లన్నకు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బోనాల ఊరేగింపులో డోలు వాయిద్యాలు, శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.



సురంగల్ గ్రామంలో బోనాల ఊరేగింపు

రైతు శ్రమ.. రోడ్డుపాలు



ఆరుగాలం కష్టించి పండించిన టమాటాలకు ధరల లేక రోడ్ల పాలవుతున్నాయి. మార్కెట్‌లో ధర లేక రవాణా ఖర్చులు కూడా వృథా అని టమాటాలను రహదారుల పక్కన కుమ్మరిస్తున్నారు. ఎకరాకు రూ.45 వేల పెట్టుబడి పెట్టి టమాట సాగు చేస్తే కూలీల ఖర్చు కూడా వెళ్లడం లేదని రైతులు వాపోతున్నారు. మార్కెట్‌లో 25కిలోల బాక్సు వంద నుంచి రూ.150 ధర పలుకుతుండటంతో సాగుకు చేసిన అప్పుల ఎలా తీర్చాలని లబోదిబోమంటున్నారు. బహిరంగ మార్కెట్‌లో కిలో టమాట రూ.3కే అమ్ముడుపోతుంది. దీంతో యాచారం మండలంలోని చౌదర్‌పల్లిలో రోడ్డు పక్కనే టమాటాలను పారబోశారు. మరికొందరు పాడిపశువులకు మేతగా వేస్తున్నారు. యాచారం, మార్చి 23(ఆంధ్రజ్యోతి)

హాస్టల్ భవనంపై నుంచి దూకి


విద్యార్థి ఆత్మహత్యాయత్నం


- షాద్‌నగర్ బీసీ బాలుర వసతిగృహంలో ఘటన



షాద్‌నగర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చందు

షాద్‌నగర్‌రూరల్, మార్చి23(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ బీసీ బాలుర హాస్టల్ భవనం పైనుంచి దూకి ఇంటర్ విద్యార్థి ఆత్మహత్యా యత్నానికి ప్రయత్నించాడు. వార్డెన్ చంద్రయ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలం అనంతసాగర్‌కు చెందిన వడ్డె చందు షాద్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతూ మహబూబ్‌నగర్ రోడ్డులో ఉన్న బీసీ బాలుర వసతి గృహంలో ఉంటున్నాడు. శనివారం ఇంటర్ పరీక్షలు పూర్తయ్యాయి. ఆదివారం అతను స్వగ్రామానికి వెళ్లాల్సి ఉండగా, మధ్యాహ్నం 12.45 గంటల సమయంలో హాస్టల్ మొదటి అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. ముందుగా హాస్టల్ గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకునేందుకు యత్నించాడు. తర్వాత మేడపై నుంచి కిందకు దూకాడు. పక్కన ఉన్న షాపింగ్ మాల్ సెక్యూరిటీ గమనించి మిగతా విద్యార్థులకు విషయం తెలియజేశారు. వెంటనే తోటి విద్యార్థులు అతడిని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ అతనికి చికిత్స అందించి... ఉస్మానియా ఆస్పత్రికి తరలిస్తూ మార్గమధ్యలో చేవెళ్లలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. విద్యార్థి పరిస్థితి మెరుగ్గానే ఉందని వైద్యులు తెలిపారు. ప్రేమ వ్యవహారమే ఆత్మహత్యా యత్నానికి కారణమని చర్చించుకుంటున్నారు.






నేడు కాంగ్రెస్ విజయోత్సవ ర్యాలీ

శామీర్‌పేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): తూంకుంటలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సోమవారం ఉదయం 9 గంటలకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదంపై విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల బిల్లు, ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తూ శాసన సభ, మండలిలో ఆమోదం పొందిన సందర్భంగా తూంకుంట నుంచి శామీర్‌పేట రింగు రోడ్డు వరకు భారీఎత్తున విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తూంకుంట మున్సిపల్, శామీర్‌పేట మండలం, మూడుచింతలపల్లి మండలాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.





'లక్ష్మీదేవిపల్లి'పై గళం వినిపిస్తాం

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

చౌదరిగూడ, మార్చి 23(ఆంధ్రజ్యోతి): నాడు ప్రతిపక్ష హోదాలో.. నేడు అధికార పక్షంలో ఉంటూ లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణంపై అనునిత్యం గళం వినిపిస్తున్నానని, ప్రజాపాలనలో రిజర్వాయర్ నిర్మించి తీరుతామని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. 42శాతం బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ, లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి భారీగా నిధులు మంజూరైన నేపథ్యంలో కాంగ్రెస్ జిల్లేడ్ చౌదరిగూడ మండల అధ్యక్షుడు చలివేంద్రపల్లి రాజు ఆధ్వర్యంలో లాల్‌పహాడ్ చౌరస్తాలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు గజమాలతో స్వాగతం పలికారు. అనంతరం ఎస్ఎస్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే రిజర్వాయర్ నిర్మాణానికి భారీగా నిధులు మంజూరు చేయడం సీఎం రేవంత్‌రెడ్డికే సాధ్యమైందన్నారు. అందరి సహకారంతో రిజర్వాయర్ నిర్మాణాన్ని పూర్తి చేస్తామన్నారు. కొందుర్గు ఉమ్మడ మండలాభివృద్ధికి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. కాంగ్రెస్ కొందుర్గు మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, మహిళా అధ్యక్షురాలు రజిత, సింగిల్ విండో ఛైర్మన్ దామోదర్‌రెడ్డి, నాయకులు సత్యనారాయణరెడ్డి, పురుషోత్తంరెడ్డి, జితేందర్‌రెడ్డి, వెంకట్‌నర్సింహారెడ్డి, బాల్‌రాజ్, గోపాల్, శివ, గోపాల్‌రెడ్డి, యాదయ్య, మల్లేష్ గౌడ్, రాంచంద్రయ్య, ఏజాజ్, చంద్రబాబు, అజ్జు, రాజేష్, చందు, నరేందర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఉగాది నుంచి సన్నబియ్యం

నందిగామ: ఉగాది నుంచి రేషన్ షాపుల్లో సన్నబియ్యం పంపిణీ చేస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని చలివేంద్రగూడలో ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు రూ.7 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. నాయకులు శివశంకర్‌గౌడ్, జంగ నర్సింహులు, కొమ్ము కృష్ణ, కుమార్‌గౌడ్, రాజగోపాల్, చంద్రపాల్‌రెడ్డి, ఎనుగొండ రమేశ్, మహేందర్, జ్ఞానేశ్వర్, నవాపేట్ రవీందర్‌గౌడ్, హనుమంతు, రాజునాయక్, రూప్‌సింగ్, శ్రీనునాయక్, శేఖర్, సుధాకర్, కిరణ్, రవి పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్ల ఏర్పాటుకు భూమిపూజ

కందుకూరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): కందుకూరు ప్రభుత్వ పాఠశాలలో హైమాస్ట్ లైట్ల ఏర్పాటుకు ఏఎంసీ డైరెక్టర్ ప్రశాంత్‌కుమార్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్, కందుకూరు మాజీ ఉపసర్పంచ్ గుండ్ర సుధాకర్‌రెడ్డి, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు గాదె కుమార్ భూమిపూజ చేశారు. ప్రభుత్వం రూ.8 లక్షలు కేటాయించిందని తెలిపారు.





యాదవులు పోరాటానికి సిద్ధమవ్వాలి

యాదవ సంఘం వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు జింకల యాదయ్య



సమావేశంలో మాట్లాడుతున్న యాదయ్యయాదవ్

దుద్యాల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): యాదవులు కలిసికట్టుగా ఉంటూ జనాభా దామాషా ప్రకారం తమ వాటా కోసం పోరాటానికి సిద్ధం కావాలని యాదవ సంఘం వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు జింకల యాదయ్య పిలుపునిచ్చారు. ఆదివారం దుద్యాల మండలంలోని లగచర్ల గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రమేశ్, ప్రధాన కార్యదర్శిగా వెంకట్రాములు, ఉపాధ్యక్షులుగా మహేశ్, రాజు, కోశాధికారిగా శ్రీనివాస్, కార్యదర్శులుగా రమేశ్, శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడిగా కృష్ణయ్య, సలహాదారురులుగా భాస్కర్, శ్రీనివాస్‌తోపాటు సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పి.రాఘవేందర్‌యాదవ్, నియోజకవర్గ అధ్యక్షుడు మన్నె బస్వరాజ్‌యాదవ్, మండల అధ్యక్షుడు నర్సింహులుయాదవ్, యాదగిరి, పటేల్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్‌యాదవ్, ఉపాధ్యక్షులు నర్సిములుయాదవ్, ప్రభాకర్‌యాదవ్, అనంతయ్య యాదవ్, కోశాధికారి హన్మంతుయాదవ్, కిష్టప్ప యాదవ్, రమేశ్‌యాదవ్, హన్మంతుయాదవ్, బాల్‌రాజ్‌యాదవ్, నర్సింహులుయాదవ్, అంజనేయులుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



కమ్యూనిటీ భవన నిర్మాణానికి నిధులివ్వాలి

ఆమనగల్లు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): కమ్యూనిటీ భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని శాలి సంఘం నాయకులు సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. ఈమేరకు ఆదివారం ఆమనగల్లు భక్తమార్కేండేయ దేవస్థానం కమిటీ, పద్మశాలి సంఘం నాయకులు సీఎంను మర్యాదపూర్వకంగా కలిశారు. పద్మశాలి సంఘం అధ్యక్షుడు ఎంగలి బాలకృష్ణయ్య, ఉపాధ్యక్షుడు అప్పం శ్రీనుల ఆధ్వర్యంలో నాయకులు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి రేవంత్‌రెడ్డిని పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఆమనగల్లు భక్త మార్కండేయ దేవాలయం వద్ద కమ్యూనిటీ భవన నిర్మాణానికి ప్రభుత్వపరంగా రూ.2కోట్ల నిధులు కేటాయించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. నాలుగు మండలాలకు కూడలిగా ఉన్న ఆమనగల్లులో పేద



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

విద్యార్థులకు వసతి, వృద్ధాశ్రమం నిర్మాణాలకు ప్రభుత్వ పరంగా తోడ్పాటునందించాలని సీఎంను కోరారు. అందుకు రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు బాలకృష్ణ, అప్పం శ్రీనులు తెలిపారు. సీఎం కలిసిన వారిలో పద్మశాలి సంఘం నాయకులు ఎంగలి యాదగిరి, మసున మురళీధర్ తదితరులు ఉన్నారు.

కనుల పండువగా మల్లన్న కల్యాణం



ఘట్‌కేసర్ రూరల్: ఒడిబియ్యం సమర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి దంపతులు

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ పరిధిలోని ప్రతాప్‌సింగారంలోని ఆలయంలో ఆదివారం మల్లికార్జున స్వామి కల్యాణం కనుల పండువగా జరిగింది. యాదవ సంఘం ఆధ్వర్యంలో మల్లికార్జునస్వామి బ్రమరాంబిక దేవిల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. ఒగ్గు కళాకారులు కల్యాణ తంతు జరిపించారు. మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి దంపతులు, జెడ్పీ మాజీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి దంపతులు ఒడిబియ్యం సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో యాదవసంఘం కమిటీ సభ్యులు, ఘట్‌కేసర్ మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరి యాదవ్, బీ-బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేశ్‌గౌడ్, బద్దం కుమార్, కీసరగుట్ట ఆలయ కమిటీ సభ్యుడు పాముకుంట్ల ప్రభాకర్ గౌడ్, మోహన్‌రెడ్డి, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టు నిర్వాసితులకాలనీలో..

శంషాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని ఎయిర్‌పోర్టు నిర్వాసితుల కాలనీలో ఆదివారం మల్లన్న స్వామి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కాలనీకి చెందిన యాదవ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కల్యాణ తంతుకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు.



బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

మహేశ్వరంలో బీఆర్‌ఎస్‌కు తిరుగులేదు

» మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

మహేశ్వరం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు బలం లేదనే విషయం ఎంత నిజమో బీఆర్‌ఎస్‌కు తిరుగులేదనేది కూడా అంతే నిజమని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని సిరిగిరిపురం గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీ నాయకులు బీఆర్‌ఎస్ మండల యువజన విభాగం అధ్యక్షుడు శ్రీను ఆధ్వర్యంలో నగరంలోని ఎమ్మెల్యే నివాసంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వీరికి గులాబీ కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌ను మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు చురుకైన పాత్ర పోషించాలన్నారు. ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేసే వరకు కాంగ్రెస్‌ను నిలదీస్తూనే ఉండాలన్నారు. 15 నెలల ప్రజాపాలనలో కాంగ్రెస్ ప్రజలకు చేసింది ఏమీ లేదని, హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూల్చడమే కాంగ్రెస్ చేసిన అభివృద్ధి అని విమర్శించారు. గ్రామాల్లో సర్పంచ్‌లు లేక అభివృద్ధి ఎక్కడికక్కడే ఆగిపోయిందని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించలేని ప్రభుత్వం మరో నాలుగేండ్లు ఎలా పాలిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనర్సింహారెడ్డి, సురేందర్‌రెడ్డి, దయ్యాల శ్రీను, బండ నర్సింహ, శ్రీకాంత్, యాదయ్య, కృష్ణ ఉన్నారు.



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

హైవేను విస్తరించాలని వినతి

» కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన బీజేపీ నేతలు

కడ్తాల్, మార్చి23 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ - శ్రీశైలం జాతీయ రహదారిని నాలుగు లేన్లుగా విస్తరించాలని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి కోరారు. ఈమేరకు ఆదివారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. హైవేపై వాహనాల రద్దీ పెరిగి, తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రద్దీకి అనుగుణంగా రహదారిని విస్తరించాలన్నారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. రహదారి విస్తరణకు డీపీఆర్ పూర్తయిందని, వీలైనంత త్వరగా రోడ్డు విస్తరణకు టెండర్లను ఆహ్వానించి పనులు ప్రారంభిస్తామని చెప్పినట్లు పేర్కొన్నారు. ఎస్టీ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయిలాల్‌నాయక్, బీజేపీ మండల అధ్యక్షుడు దోనాదుల మహేశ్, బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు శ్రీశైలంగౌడ్, మండల మాజీ అధ్యక్షుడు మన్యనాయక్, నాయకులు లక్ష్మణ్, మల్లేశ్, వెంకటేశ్ ఉన్నారు.



బీఆర్‌ఎస్ నాయకులకు, కార్యకర్తలకు అభివాదం చేస్తున్న కేటీఆర్

శామీర్‌పేటలో కేటీఆర్‌కు ఘన స్వాగతం

శామీర్‌పేట, మార్చి 23(ఆంధ్రజ్యోతి): శామీర్‌పేటలో మాజీ మంత్రి కేటీఆర్‌కు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. ఆదివారం కరీంనగర్‌లో బీఆర్‌ఎస్ సమావేశానికి కేటీఆర్ హైదరాబాద్ నుంచి బయలుదేరి వెళ్తున్న క్రమంలో రాజీవ్ రహదారిలో శామీర్‌పేట పెద్ద చెరువు కట్టమైసమ్మ వద్ద ఆగారు. ఉదయం నుంచి ఆయన రాక కోసం ఎదురుచూస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలను చూసి ఆగి అభివాదం చేశారు. అనంతరం అక్కడి నుంచి కరీంనగర్‌కు వెళ్లారు.



పన్ను వసూలు చేస్తున్న అధికారులు

పన్ను వసూలుకు ప్రత్యేక బృందాలు

తాండూరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): బృందాలుగా ఏర్పడి ఆస్తి పన్ను వసూలు చేసేందుకు మున్సిపల్ యంత్రాగం రంగంలోకి దిగింది. తాండూరు మున్సిపాలిటీ జీఎస్‌డీపీ చేరుకోవాలంటే రూ.కోటీ 30లక్షలు ఆస్తి పన్ను వసూలు చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో మిగిలిన ఎనిమిది రోజులు మొండి బకాయిదారుల వద్దకు వెళ్లి ఆస్తి పన్ను వసూలు చేయాలని నిర్ణయించారు. మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ విక్రం సింహారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం మేనేజర్ నరేందర్‌రెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు అశోక్, రమేష్‌లు బృందంగా ఏర్పడి మొండి బకాయిదారుల వద్దకు వెళ్లి బకాయిలను వివరిస్తూ ఆస్తి పన్ను చెల్లించాలని కోరారు. వీరితోపాటు ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమేష్ కుమార్ ఆధ్వర్యంలో జవాన్లు బృందంగా ఏర్పడి ఆస్తి పన్ను వసూళ్లు చేపట్టారు. మొండి బకాయిదారులకు నోటీసులు జారీ చేసి ఆస్తులను జప్తు చేస్తామని మున్సిపల్ కమిషనర్ హెచ్చరించారు.

అప్రమత్తతే శ్రీరామరక్ష

- » క్షయతో తస్మాత్ జాగ్రత్త
- » లక్షణాలు కన్పిస్తే పరీక్షలు తప్పనిసరి
- » రోగ నివారణకు కొత్త ఔషధం
- » టీబీకి అనంతగిరిలో ప్రత్యేక ఆస్పత్రి



తాండూరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): సంక్రమిత వ్యాధుల్లో క్షయ ఒకటి. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలను కూడా హరించేస్తుంది. మైక్రో బ్యాక్టీరియా అనే క్రిమి వల్ల ట్యూబర్‌క్యూలోసిస్(క్షయ) వ్యాపిస్తుంది. ఇప్పటికీ ప్రతి లక్ష మందిలో 206 మంది దీని భారిన పడుతున్నారు. క్రమం తప్పకుండా ఆరు నెలలు మందులు వాడితే బయట పడే అవకాశాలున్నాయి. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే పరీక్షలు చేయించుకొని చికిత్స చేయించుకోవాలి. లేదంటే..

క్షయను నాలుగు కేటగిరీలుగా విభజించారు. మొదటిసారి సోకితే కేటగిరి -1గా భావిస్తారు. వీరికి ఆరు నెలల పాటు మందులు అందిస్తారు. పాత వారికి మళ్లీ టీబీ సోకినట్టు గుర్తిస్తే వారిని కేటగిరి - 2గా గుర్తించి 8 నెలలపాటు మందులు అందిస్తారు. ఇక కేటగిరి -3 భారినపడే వారిని మొండి క్షయ వ్యాధి గ్రస్తులు(ఎండిఆర్) అంటారు. కేటగిరి - 4ను ముదిరిపోయిన వ్యాధిగ్రస్తులు(ఎక్స్‌డీఆర్)గా పరిగణిస్తారు. వీరికి తొమ్మిది నెలల నుంచి 24 నెలల పాటు మందులు అందిస్తారు. 24 నెలలపాటు మందులు వాడాల్సిన వారిని తీవ్రమైన కేసులుగా పరిగణిస్తారు. వీరికి ప్రభుత్వం మందులను ఉచితంగా ఇస్తూ కొలుకునే వరకు వైద్య సేవలు అందిస్తుంది.



నేడు అంతర్జాతీయ క్షయ నివారణ దినోత్సవం

దగ్గు ద్వారా వ్యాప్తి

క్షయ అంటు వ్యాధి. ఇది దగ్గు ద్వారా ఇతరులకు వేగంగా వ్యాప్తి చెందుతుంది. ఇంట్లో టీబీతో బాధపడే వారికి మిగిలిన కుటుంబ సభ్యులు కొంత దూరంగా ఉండాలి. వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉండే రోగులు, చిన్నారులను బాధితులకు దూరంగా ఉంచడం ద్వారా వ్యాధి భారిన పడకుండా కాపాడవచ్చు. టీబీ వ్యాధి గ్రస్తులను గుర్తించే క్షేత్రస్థాయి ఆరోగ్య సిబ్బంది ఆశా వర్కర్లకు, ప్రైవేటు వైద్యులు గుర్తిస్తే వారికి సైతం ప్రభుత్వం ప్రోత్సాహాలు అందిస్తోంది. వ్యాధితో బాధపడే రోగులకు పోషకాహారం కోసం నెలకు రూ.1,000 చొప్పున అందిసున్నారు.

వ్యాధి లక్షణాలు

టీబీకి గురి చేసే వైరస్ ఊపిరితిత్తుల్లో నివసిస్తుంది. పోషకాహార లోపంతో బాధపడే వారికి, వెంటిలేషన్ సరిగాలేని ఇళ్లల్లో ఉండే వారికి, దీర్ఘకాళిక వ్యాధులతో బాధపడే వారికి, షుగర్, హెచ్‌ఐవీ బాధితులకు వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉండే వారికి ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉంది. వ్యాధి భారినపడిన వారిలో ఎడతెరిపి లేని దగ్గు, దగ్గినప్పుడు రక్తం పడడం, సాయంత్రం వేళ జ్వరం రావడం, నీరసం, బరువు తగ్గడం, చాతిలో నొప్పి, ఆయాసం అధికంగా ఉండడం, ఆకలి మందగించడం వంటి లక్షణాలు కన్పిస్తాయి. వీరికి మైక్రోస్కోపి, ఆర్‌పీసీఆర్, సీబీ నాట్ పరీక్షలు నిర్వహించడం ద్వారా వ్యాధిని నిర్ధారిస్తారు.

టీబీ నియంత్రణకు 6 హెచ్‌పీ

తాండూరు జిల్లా ఆస్పత్రిలోని ఆర్ట్ సెంటర్‌లో టీబీ నివారణకు 6 హెచ్‌పీ ఔషధాన్ని ఆవిష్కరించారు. టీబీ నియంత్రణను ఆరు నెలల నుంచి 28 రోజులకు కుదించారు. 6 హెచ్‌పీ (600ఎంజీ) వాడితే ఇక టీబీ సోకదు. దీంతో వ్యాధిగ్రస్తులు భయపబాల్సిన అవసరం లేదు. హెచ్‌ఐవి వ్యాధి గ్రస్థులకు టీబీ వ్యాధి సోకకుండా ఈ ఔషదాన్ని వాడితే ఆరోగ్యవంతులవుతారు. గతంలో ఆరు నెలల పాటు మందులు వాడాల్సి ఉండేది. నివారణకు మందు రావడం రోగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

టీబీకి ఔషధ 'గిరి'

టీబీ నివారణలో అనంతగిరి కొండలకు ఓ ప్రత్యేకత ఉంది. పలు రకాల మొక్కల్లో వ్యాధిని నయం చేసే గుణాలు ఉన్నాయి. ఇక్కడ ప్రత్యేకంగా టీబీ ఆస్పత్రి కొనసాగుతుంది. ఏళ్ల చరిత్ర ఉన్న ఈ దవాఖానకు తెలంగాణ నుంచే కాకుండా పలు రాష్ట్రాల నుంచి టీబీ వ్యాధిగ్రస్తులు వస్తున్నారు. చికిత్స పొంది బయటపడుతున్నారు.

క్షయపై అవగాహన ఉండాలి



టీబీపై అందరికీ అవగాహన ఉండాలి. అప్పుడే నియంత్రణ సాధ్యమవుతుంది. షుగర్ బాధితులు, వృద్ధులు, పొగతాగే అలవాటు ఉన్న వాళ్లు, గుట్కా, పాన్ తినేవారికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నాం. ప్రతి పీహెచ్‌సీలోనూ ఈ పరీక్షలు చేస్తారు. అన్ని రకాల మందులు ఇస్తారు. వ్యాధి బారిన పడినవారు ఆరు నెలలపాటు క్రమం తప్పకుండా మందులు వాడాల్సి ఉంటుంది.

- డాక్టర్ జయప్రసాద్



కొత్తగూడలో శ్రీపాతాళ త్రికోణ మహాసుందరి అమ్మవారు

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన

శంకర్‌పల్లి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): పర్వేద అనుబంధ గ్రామమైన కొత్తగూడలోని శ్రీపాతాళ త్రికోణ మహాసుందరి విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా జరిగింది. 20 అడుగుల అమ్మవారి ద్విముఖ భారీ విగ్రహాన్ని ఆదివారం తెల్లవారుజామున వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రతిష్ఠించారు. ఆలయ ధర్మకర్త మాధవరెడ్డితోపాటు పలువురు ప్రత్యేక పూజలు చేశారు. 100 అడుగుల ఎత్తుతో రాజగోపుర నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు.

ఆశా వర్కర్ల ముందస్తు అరెస్టు

ధారూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్లు ధర్నాకు వెళ్లకుండా ఆదివారం రాత్రి పోలీసులు ఆరెస్టు చేసి పోలీసుస్టేషన్లకు తరలించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లో ఆశా వర్కర్ల ధర్నా ఉన్న నేపథ్యంలో కొంతమంది ఆశా వర్కర్లను పోలీసులు ఆదివారి రాత్రి ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్లకు తరలించారు. రాత్రి పూట ఆరెస్టు చేయడంతో ఆందోళన వ్యక్తం చేశారు.



చెక్కు అందజేస్తున్న గోలి శ్రీనివాస్‌రెడ్డి

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే లక్ష్యం

ఆమనగల్లు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని అందించి ఆరోగ్య సమాజ నిర్మాణానికి రాష్ట్ర ఫుడ్ కమిషన్ కృషి చేస్తుందని కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆహార పదార్థాలను కల్తీచేస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆమనగల్లు మండలంలో ఆదివారం శ్రీనివాస్‌రెడ్డి పర్యటించారు. పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పెంటతండాకు చెందిన జాటావత్ రవికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ.18వేల చెక్కును ఆయన అందజేశారు. శంకర్‌నాయక్, రాములునాయక్, సురమళ్ళ సుభాష్, చంద్రశేఖర్‌రెడ్డి, సుమన్‌నాయక్, శేఖర్, సతీష్, శివకుమార్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి సన్మానం

షాద్‌నగర్ అర్బన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా నియమితుడైన రాజ్‌భూపాల్‌గౌడ్‌ను బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఆదివారం శంషాబాద్‌కు వెళ్లి రాజ్‌భూపాల్‌గౌడ్‌ను సన్మానించి, శివాజీ ఫొటో ఇచ్చి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చెట్ల వెంకటేష్, కాసోజు శివ, మురళీధర్‌రెడ్డి, కిరణ్‌గౌడ్, శేఖర్‌గౌడ్, కటికల రాజు, రాఘవేందర్, శ్రీనాథ్, రాజు, అజయ్, మనోహర్, కందివనం అజయ్, శేఖర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల: బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగి రాజ్‌భూపాల్‌గౌడ్‌ను చేవెళ్ల మండల బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీని బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, కృష్ణయాదవ్, కరుణారెడ్డి, మణిక్యరెడ్డి, ధనుష్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, సందీప్‌గౌడ్, నాగరాజు తదితరులు ఉన్నారు.



షాద్‌నగర్ అర్బన్: రాజ్‌భూపాల్‌గౌడ్‌ను సన్మానిస్తున్న షాద్‌నగర్ బీజేపీ యువ నాయకులు

కందుకూరు: మండలంలోని తిమ్మాపురం, బేగంపేట గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగి రాజ్‌భూపాల్‌గౌడ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తిమ్మాపుం మాజీ సర్పంచ్ పున్న భిక్షపతి, నాయకులు రమేష్‌గౌడ్, గంగాపురం రాజేందర్‌రెడ్డి, సహకార సంఘం డైరక్టర్ పర్వతాలు, అమరేందర్‌రెడ్డి, రమేశ్, నర్సింహాగౌడ్, సరికొండ వెంకటేశ్, పరమేశ్, శీనివాస్, రాజు, కుమార్, వెంకటేష్, నరేందర్ పాల్గొన్నారు.

ఉరుములు, మెరుపులతో వడగండ్ల వాన



దుద్యాల: దుద్యాల గేటు సమీపంలో రోడ్డుపై పడిన చెట్టు

మోమిన్‌పేట్/నవాబుపేట/ధారూరు/మర్పల్లి/దుద్యాల/కోట్‌పల్లి/పరిగి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో అక్కడక్కడ పంటలు దెబ్బతిన్నాయి. ఉరుములు, మెరుపులతో కురిసిన భారీ వర్షానికి ఉల్లి, మొక్కజొన్న తదితర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. పది రోజుల్లో చేతికొచ్చే ఉల్లి పంట వర్షానికి పూర్తిగా దెబ్బతిన్నదని రైతులు కన్నీరుమున్నీరయ్యారు. ధారూరు మండల పరిధిలోని ధర్మాపూర్, కొండాపూర్‌కలాన్ గ్రామాల్లో ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులు, గాలులతో వడగండ్ల వాన కురిసింది. దాదాపు అరగంట పాటు వర్షం కురవడంతో దుక్కుల్లో వడగండ్లు కుప్పలు, కుప్పలుగా కనిపించాయి.



ధారూరు: ధర్మాపూర్ శివారులోని పాలంలో కురుస్తున్న వడగండ్ల వాన

అధికారుల పరిశీలన

మోమిన్‌పేట్ మండలంలో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఎన్కతల, రాంనాథ్‌గూడుపల్లి, టేకులపల్లి, అమ్రాదికలాన్, అమ్రాదికుర్దు తదితర గ్రామాల్లో మొక్కజొన్న, వరి, ఉల్లి, కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. దెబ్బతిన్న పంటలను అధికారులు పరిశీలించి ప్రభుత్వం ద్వారా పరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల రైతులు కోరారు. నవాబుపేట మండలంలోని అక్నాపూర్, నారేగూడ, దాదాపూర్, పులుమామిడి, చింతల్‌పేట్, చిట్టిగిద్ద తదితర గ్రామాల్లో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి జొన్న, టమాట, ఉల్లి పంటలు దెబ్బతిన్నాయి. మర్పల్లి మండలంలోని బిల్కల్, కొంశెట్టిపల్లి, మల్లికార్జునగిరి గ్రామాల్లో వర్షానికి దెబ్బతిన్న పంటలను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని ఏఈవో జ్యోతి తెలిపారు. ఆదివారం బిల్కల్, మల్లికార్జునగిరి గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను ఆమె పరిశీలించి వివరాలను సేకరించారు.



మర్పల్లి: పొలాలను పరిశీలిస్తున్న ఏఈవో జ్యోతి

తీరని నష్టం

కోట్‌పల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం గాలివాన, వడగండ్ల వానతో పంటలకు నష్టం వాటిల్లింది. మోత్కుపల్లి గ్రామంలో ఈడిగి మాణయ్య గౌడ్ ఎకరం పొలంలో జొన్న పంట నేలకొరిగింది. పూలు, జొన్న, ఉల్లి పంటలు పాడయ్యాయి.

పరిగి: పరిగిలో ఆదివారం ఈదురు గాలులతో కూడిన వడగళ్ల వర్షం కురిసింది. ఒక్కసారి వాతావరణం చల్లబడింది. పరిగితోపాటు, రాఘవాపూర్, కాళ్యాపూర్,రంగాపూర్, పేటమాదారం గ్రామాల్లో వర్షంతోపాటు వడగళ్లు పడ్డాయి.



దుద్యాల సమీపంలో నేలకొరిగిన వేప చెట్టు

నేలకొరిగిన భారీ వృక్షాలు

దుద్యాల మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో ఈదురుగాలులు, వడగళ్లతో కూడిన భారీ వర్షం కురిసింది. పలు చోట్ల భారీ వృక్షాలు నేలకొరిగాయి. ఓ ఇంటి పైకప్పు గాలికి ఎగిరిపోయింది. మామిడి తోటల్లో కాయలు రాలిపోయాయి. అల్లిఖాన్‌పల్లి శివారులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కింద పడింది. ఓ రైతు పొలంలో తుమ్మ చెట్టు వేర్లతో సహా కూలి పొలంలో పడింది. కోత దశకు వచ్చిన వరి పంటకు వడగండ్ల వర్షంతో నష్టం జరిగింది. అరగంట పాటు కురిసిన వర్షానికి వాతావరణం ఒక్కసారిగా చల్లబడటంతో ఉక్కపోత నుంచి కాస్త ఉపశమనం దొరికింది.

నీటిని పొదుపుగా వాడుకోవాలి



- షాద్‌నగర్ మున్సిపల్ కమిషనర్ సునీత

ఫటా ఫట్

షాద్‌నగర్ అర్బన్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): వేసవి ప్రారంభంలోనే ఎండలు మండిపోతున్నాయి. నీటి వినియోగం పెరిగి, జలాశయాలు ఇంకిపోతున్నాయి. భూగర్భజలం రోజురోజుకూ లోలోపలికి వెళ్లిపోతోంది. బోరుబావులు సైతం ఎండిపోతూ.. తాగునీటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఈక్రమంలో ప్రస్తుత పరిస్థితుల్లో తాగునీటి సరఫరా కోసం తీసుకుంటున్న చర్యలపై షాద్‌నగర్ మున్సిపల్ కమిషనర్ సునీతతో 'ఆంధ్రజ్యోతి' ఫటాఫట్ ఇంటర్వ్యూ.

ప్రశ్న: తాగునీటి సరఫరాకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: మున్సిపాలిటీలో 9,762 నల్లా కనెక్షన్లు ఉన్నాయి. వాటి ద్వారా మిషన్ భగీరథ నీటిని సరఫరా చేస్తున్నాం. అలాగే 322 బోరు పంపులు నడుస్తున్నాయి. తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. నీటిని పొదుపుగా వాడాలి. ఎప్పుడైనా సరే తాగునీరు పట్టుకోగానే నల్లాలు, పంపుసెట్లను బంద్ చేయాలి.

ప్రశ్న: పారిశుధ్య పనులు ఎలా చేపడుతున్నారు?

జవాబు: మున్సిపాలిటీలో 116 మంది సిబ్బంది అనునిత్యం పారిశుధ్య పనులు కొనసాగిస్తున్నారు. చెత్త సేకరణ కోసం 6ట్రాక్టర్లు, 28ఆటోలు, ఒక జేసీబీ, డోజర్‌ను వినియోగిస్తున్నాం. రోడ్లు, ఖాళీ ప్లాట్లు, మురుగునీటి కాలువల్లో చెత్త వేయకుండా ప్రజల్లో చైతన్యం తెస్తున్నాం. కొందరు ఏమాత్రం పట్టించుకోకుండా రోడ్ల పక్కన, ఖాళీ స్థలాల్లో చెత్తను పడేస్తున్నారు. అలాంటి వారిని గుర్తించి, చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: రోడ్ల ఆక్రమణపై ఎలా ముందుకెళ్తున్నారు?

జవాబు: మున్సిపాలిటీ చట్టం ప్రకారం ప్రతీ ఒక్కరు 30 ఫీట్ల రోడ్డును వదిలి నిర్మాణాలు చేపట్టాలి. మున్సిపాలిటీలో విలీనమైన చటాన్‌పల్లి, సోలీపూర్ గ్రామాల్లో కూడా నిబంధనలు వర్తిస్తాయి. ఇంటి, వ్యాపార సముదాయాన్ని బట్టి పార్కింగ్ స్థలాన్ని వదలాలి. నిబంధనలు పాటించకుండా చేపట్టే నిర్మాణాలపై, రోడ్లను ఆక్రమించి వ్యాపారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: ఇంకుడు గుంతల నిర్మాణం తప్పనిసరి చేశారా?

జవాబు: ఇంటి నిర్మాణంలో భాగంగా ఇంకుడు గుంత తప్పక నిర్మించాలి. నిబంధనల ప్రకారం నిర్మించిన వారికే ఇంటినెంబర్ ఇవ్వాలన్నది నిబంధన. అలాగే ఇంకుడుగుంత నిర్మాణానికి చెల్లించిన ఫీజును వాపసు ఇస్తాం. ఇంకుడుగుంతల వల్ల బోరు ఎప్పటికీ ఎండిపోదు.

ప్రశ్న: పన్నుల వసూలు, ఎల్ఆర్ఎస్ ఫీజులు ఎలా ఉన్నాయి?

జవాబు: మున్సిపాలిటీలో రూ.2కోట్ల 70లక్షల పన్ను బకాయిలు ఉన్నాయి. ఎల్ఆర్ఎస్ కోసం 16వేల దరఖాస్తులు వచ్చాయి. ఈనెల 31లోపు ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లిస్తే, 25శాతం ఫీజు రాయితీ వర్తిస్తుంది.

ప్రశ్న: మున్సిపల్ స్థలాల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలేమిటి?

జవాబు: వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చి, ఇంటి స్థలాలను విక్రయించే ముందు వదిలిన 10శాతం స్థలాన్ని, రోడ్లను మున్సిపాలిటీకి వెంచర్ యజమాని రిజిస్ట్రేషన్ చేయాలి. ఎవరైన రిజిస్ట్రేషన్ చేయకున్నా.. అవి మున్సిపాలిటీ స్థలాలే. ప్రజల అవసరాల కోసం కేటాయించిన స్థలల పరిరక్షణకై కాలనీవాసులు సహకారం అందించాలి. మున్సిపల్ స్థలం ఆక్రమణకు గురైతే సమాచారం ఇవ్వాలి.

గ్రంథాలయ భవనానికి వీడిన గ్రహణం

- ప్రారంభోత్సవానికి లైన్ క్లియర్
- ఎమ్మెల్యే శంకర్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ చొరవతో ప్రారంభానికి సిద్ధం



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న నూతన గ్రంథాలయ భవనం

కొత్తూర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో అత్యాధునిక హంగులతో నిర్మించిన నూతన గ్రంథాలయ భవన ప్రారంభానికి గ్రహణం వీడి, ప్రారంభానికి సిద్ధమైంది. 2022లో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నూతన గ్రంథాలయ భవన నిర్మాణానికి రూ.75లక్షలు మంజూరయ్యాయి. ఆ నిధులతో భవన నిర్మాణ పనులు పూర్తి కాలేదని, సొంత డబ్బుతో పనులు పూర్తి చేశానని, తమ బిల్లును మంజూరు చేయాలని సదరు కాంట్రాక్టర్ అధికారుల ముందు ఆవేదన వ్యక్తం చేస్తూ వస్తున్నారు. కాంట్రాక్టర్‌కు అదనపు బిల్లు మంజూరు కాకపోవడంతో గ్రంథాలయ భవనానికి తాళం వేసుకుని వెళ్లిపోయారు. నూతన భవన నిర్మాణ పనులు పూర్తి చేసుకొని సంవత్సరం కావస్తున్నా.. ప్రారంభానికి నోచుకోలేదు. ప్రస్తుతం అద్దె భవనంలో గ్రంథాలయం కొనసాగుతోంది. దాంతో పాఠకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కొత్తూర్ పర్యటనకు వచ్చినప్పుడు తాళం వేసిన గ్రంథాలయ భవనాన్ని పరిశీలించి విషయం తెలుసుకున్నారు. అనంతరం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డితో చర్చలు జరిపారు. ఆయన స్పందిస్తూ సదరు కాంట్రాక్టర్‌కు రావాల్సిన బకాయిలు చెల్లించేందుకు చొరవ తీసుకున్నారు. ఇటీవల కాంట్రాక్టర్ గ్రంథాలయ భవనానికి తాళం తీసి వెళ్లిపోయాడు. దాంతో గ్రంథాలయ భవన ప్రారంభానికి మార్గం సుగమమైంది. గ్రంథాలయ భవన ప్రారంభం కోసం ఎప్పుడెప్పుడాని ఎదురుచూస్తున్న పాఠకులకు త్వరలో సమస్య దూరం కానుంది. ఈనెలాఖరు లోపు గ్రంథాలయం ప్రారంభం కానున్నట్లు సమాచారం. భవన ప్రారంభానికి కృషి చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డిలకు మండల ప్రజలు ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు.

ఎమ్మెల్యే కృషితోనే మార్గం సుగమం



షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కృషితోనే త్వరలో నూతన గ్రంథాలయ భవనం ప్రారంభం కానుంది. కాంట్రాక్టర్‌కు అదనపు బిల్లు చెల్లించకపోవడంతోనే ప్రారంభానికి నోచుకోలేదు. అద్దె భవనంలో కొనసాగుతన్న గ్రంథాలయంలో పాఠకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎమ్మెల్యే శంకర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు.

- జె.సుదర్శన్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు

గురుమందిర వార్షికోత్సవానికి
ఎంపీ కొండాకు ఆహ్వానం



కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందిస్తున్న నిర్వాహకులు

చేవెళ్ల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గొల్లగూడలోని శ్రీ సాందీప అచల రుషి పరిపూర్ణ గురుమందిర వార్షికోత్సవంతో పాటు శ్రీ సచ్చిదానంద సాయనార్యుల 51వ వార్షికోత్సవాలు ఏప్రిల్ 2న వైభవంగా నిర్వహిస్తున్నట్లు గురుమందిర వ్యవస్థాపకులు దయానంద నాగుల వెంకటేశం తెలిపారు. ఈ వేడుకలకు రావాల్సిందిగా చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని నిర్వాహకులు కలిసి ఆదివారం ఆహ్వాన పత్రిక అందించారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు నాగుల శంకర్ గురుప్రసాద్, బీజేపీ మండలాధ్యక్షుడు అనంతరెడ్డి, యువ నాయకుడు డాక్టర్ వైభవ్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'కాసుల కక్కుర్తితో మోసాలకు పాల్పడొద్దు'

మొయినాబాద్ రూరల్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత సంపాదన కోసం కొందరు ఇన్‌ఫ్లూయన్సర్లు సోషల్ మీడియా ద్వారా యువతను నాశనం చేసే బెట్టింగ్ యాప్‌లతో పాటు ఇతర ప్రమోషన్లు చేస్తూ మోసాలకు పాల్పడవద్దని టీఎల్ఎఫ్ మొయినాబాద్ మండలాధ్యక్షుడు మహేందర్ ప్రకటనలో పేర్కొన్నారు. బెట్టింగ్ యాప్‌లకు కొందరిపై కేసులు నమోదవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

బీసీ సంక్షేమ సంఘం మండల కమిటీ



నియామకపత్రం అందజేస్తున్న ఆర్.కృష్ణయ్య

తలకొండపల్లి, మా ర్చి 23(ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ సంఘం తలకొండపల్లి మండ ల కార్యవర్గాన్ని బీసీ సంక్షేమ సంఘం జా తీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య ప్రకటించా రు. ఆదివారం హైదరాబాద్‌లోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో నాయకులు సమావేశమై నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుజ్జరి రాఘవేందర్, ఉపాధ్యక్షులుగా తిరుమణి యాదయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శిగా గోద నర్సింహాగౌడ్, అధికార ప్రతినిధిగా గంగమోని రవిందర్‌యాదవ్, ప్రచార కార్యదర్శిగా కాకి నరేశ్‌ముదిరాజ్, సోషల్ మీడియా ఇన్‌చార్జిగా కానుగుల కుమార్‌యాదవ్, స్వామిగౌడ్‌లను ఎన్నుకున్నారు. కార్యవర్గానికి కృష్ణయ్య నియామకపత్రం అందజేసి అభినందించారు. రాష్ట్ర కార్యదర్శి మణికంఠ, నాయకులున్నారు. అలాగే తలకొండపల్లి మండల బీసీ నాయకులు కృష్ణయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయడంలో కీలక భూమిక పోషించిన కృష్ణయ్యకు అభినందనలు తెలిపారు. నిర్మలశ్రీశైలంగౌడ్, కుమార్, శంకర్, రవిందర్‌యాదవ్, రాఘవేందర్, లింగంగౌడ్, నర్సింహగౌడ్, శ్రీకాంత్, కుమార్‌లున్నారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్

- మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్



కందుకూరు/షాబాద్ : కేఎల్లార్‌కు బొకే ఇచ్చి సత్కరిస్తున్న ముస్లిం నాయకులు, షాబాద్ మండలం మీరాపూర్‌లో నిర్వహించిన ఇఫ్తార్ విందులో ముస్లిం మతపెద్దలు

కందుకూరు/షాబాద్, 23(ఆంధ్రజ్యోతి): మత సామరస్యానికి ప్రతీక రంజాన్ అని కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి ముస్లిం మతపెద్ద మహ్మద్‌జానీ ఆధ్వర్యంలో కందుకూరులో నిర్వహించిన ఇఫ్తార్ విందులో కేఎల్లార్ పాల్గొన్నారు. మాజీ జెడ్పీటీసీలు బొక్కా జంగారెడ్డి, ఏనుగు జంగారెడ్డి, రాష్ట్ర నాయకులు దేవ భాస్కర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణానాయక్, నాయకులు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, సులేమాన్, సత్యనారాయణ, విఘ్నేశ్వర్‌రెడ్డి తదితరులున్నారు. అలాగే రంజాన్ మాసం ఎంతో పవిత్రమైందని షాబాద్ మండలం మీరాపూర్ దర్గా నిర్వాహకుడు చెన్నాబాయ్ అన్నారు. మీరాపూర్‌లో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మాజీ సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, దర్పల్లి రవీందర్‌గౌడ్, మైనారిటీ సోదరులు మతీన్, మాజిద్, షఫీ, ఆరిఫ్, అయూబ్, రుక్నొద్దీన్, షమీమ్ తదితరులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థులు

చదువుతోనే సమాజంలో గుర్తింపు

చేవెళ్ల, మార్చి 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణ పట్టుదలతో చదువుకుని ఉన్నతులుగా ఎదగాలని, చదువుతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని ఎంఈవో పురందాస్, ఎస్సై సంతోష్‌రెడ్డి తెలిపారు. పట్టణ కేంద్రంలోని సిల్వర్‌డేల్ ఇంటర్నేషనల్ స్కూల్లో గ్రాడ్యుయేషన్‌డే నిర్వహించారు. అంతకు ముందు కరెస్పాండెంట్ మోహన్‌చారి, ప్రిన్సిపాల్ సునితా రెడ్డిలు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో పాఠశాలలో నూతన విద్యా విధానాలకు నాంది పలకబోతున్నామని చెప్పారు. విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

సంక్షిప్తంగా..

కడ్తాల్ : రాష్ట్ర పాడి పరి శ్రమాభివృద్ధి సహకార సంస్థ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డిని ఆదివారం ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, జగన్, బీచ్యనాయక్‌లు నగరంలో మర్యాదపూర్వకంగా కలిశారు. విజయ పాడిరైతులకు పాలబిల్లులను చెల్లించాలని కోరగా వారంరోజుల్లో రెండు బిల్లులు రైతుల ఖాతాలో వేస్తామని తెలిపినట్లు చెప్పారు.

కేశంపేట : వనభోజనాలతో కులస్తుల మధ్య ఐకత్య ఏర్పడుతుందని పద్మశాలి సంఘం మండలాధ్యక్షుడు చందు అన్నారు. పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో వనభోనాలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. అంతకు ముందు భక్త మార్కండేయ స్వామి చిత్రపటానికి పూజలు చేశారు.

కందుకూరు : వనభోజనం(గంపజాతర)ను కందుకూరు గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి చెట్ల కింద వంటావార్పు చేసుకున్నారు.

మహేశ్వరం : విద్యార్థులు బాల్యం నుండే పుస్తక పఠనంతో పాటు పర్యావరణ పరిరక్షణ నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు భాస్కర్‌రెడ్డి అన్నారు. తుక్కుగూడలోని శ్లోకా ఇంటర్నేషనల్‌స్కూల్లో నిర్వహించిన జలదినోత్సవంలో భాగంగా విజేతలకు శనివారం రాత్రి ఆయన బహుమతులందించారు.

జిల్లాలో పెరగనున్న అసెంబ్లీ స్థానాలు

(5వ పేజీ తరువాయి)

మహేష్‌కుమార్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి మల్‌రెడ్డి రంగారెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని కోరారు.

ఆర్థిక నేరగాళ్లకు బీజేపీ అండగా ఉంది

- షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఆర్థిక నేరగాళ్లకు బీజేపీ అండగా ఉందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆరోపించారు. అంబాని వంటి వారికి దేశ సంపదను కేంద్రం దోచిపెడుతుందని ఆరోపించారు. అంబేడ్కర్‌ను అవమాన పర్చిన అమిత్‌షా కేంద్ర హోంశాఖ పదవికి అనర్హుడని ఆయన పేర్కొన్నారు. "జై బాపు, జై భీమ్, జై సంవిధాన్" అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా కార్యకర్తలు ముందుకు వెళ్లాలని కోరారు.

జిల్లాకు మంత్రి పదవి ఇవ్వాలి

- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే రంగారెడ్డి

రంగారెడ్డి జిల్లా మిగతా జిల్లాల కంటే పెద్దదని, ఈ జిల్లాకు మంత్రి లేదని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. జిల్లాకు మంత్రి లేని కారణంగా పార్టీ నేతలు, కార్యకర్తలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సమస్య ఎవరితో చెప్పుకోవాలో తెలియక సతమతం అవుతన్నట్లు చెప్పారు. పార్టీ కోసం కష్టపడిన నేతలు పదవుల కోసం ఎదురు చూస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

ఆరు గ్యారెంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లలేకపోతున్నారు..

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆరు గ్యారెంటీలను ప్రజల్లోకి తీసుకు వెళ్లడంతో పార్టీ నేతలు, కార్యకర్తలు విఫలమవుతున్నట్లు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకు వెళ్లేలా కృషి చేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర డెయిరీ ఫెడరేషన్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి, పీసీసీ సభ్యులు దేప భాస్కర్, జనార్ధన్‌రెడ్డి, రాచమళ్ల సిద్దేశ్వర్, ఏనుగు జంగారెడ్డి, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, మహిళా నేతలు మైలారం సులోచన, సదాలక్ష్మి, సీనియర్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, వీరేందర్‌రెడ్డి, పాండు యాదవ్, బాలయ్య, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు నాగేందర్ రెడ్డి, సంవిదాన్ రాజేంద్రనగర్ ఇన్‌చార్జి వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు డుమ్మా!

టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ హాజరైన "జై బాపు, జై భీమ్, జై సంవిధాన్" అభియాన్ జిల్లా సన్నాహక సమావేశానికి పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ సీనియర్ నేతలు, ఆయా మండలాల అధ్యక్షుడు డుమ్మా కొట్టారు. జిల్లా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీతో పాటు ఎమ్మెల్సీలు సమావేశానికి డుమ్మా కొట్టారు. అలాగే పార్టీ సీనియర్ నేతలు, ఆయా మండలాల అధ్యక్షులు హాజరు కాలేదు.

'పారిశ్రామిక పార్కుకు భూములివ్వం'

యాచారం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక పార్కు కోసం గ్రామంలో 821 ఎకరాల భూములను తీసుకుంటే మా ప్రాణాలు వదులుకోవడం ఖాయమని, సెంటు భూమిని కూడా వదులుకునేదిలేదని మండలంలోని మొండిగౌరెల్లి రైతులు శనివారం రాత్రి గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. చావనైనా చస్తాం కాని.. భూములు ఇచ్చేదిలేదని రైతులు ఖరాఖండిగా చెప్పారు. అసైన్డ్ భూములు ఇవ్వమని కొంతమంది అధికార పార్టీ నాయకులు రైతులకు మాయమాటలు చెబుతున్నారని.. వారి ధోరణి మార్చుకోవాలని అన్నారు. రైతుల కంటే పార్కు అంత ముఖ్యమా? అని ఈ సందర్భంగా రైతులు ప్రశ్నించారు.

'లక్ష్మీదేవి' కటాక్షించేనా?

(5వ పేజీ తరువాయి)

ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం దాని ఊసే ఎత్తలేదు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో అంతర్భాగమైన లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి స్థల ఎంపిక, భూ సేకరణపై చర్చలు మాత్రమే జరిగాయి. తాజాగా అసెంబ్లీ బడ్జెట్ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ గురించి ప్రస్తావించారు. సత్వరమే నిర్మాణాన్ని చేపడతామని తెలిపారు. దీంతో ఈ రిజర్వాయర్‌పై రైతన్నల్లో మళ్లీ ఆశలు చిగురించాయి.

20ఏళ్ల కిందటే రిజర్వాయర్ ప్రస్తావన


తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషిస్తున్న కేసీఆర్... పల్లెబాటలో భాగంగా 2004లో ఈ ప్రాంతానికి వచ్చినప్పుడు లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ గురించి ప్రస్తావించారు. ఈ రిజర్వాయర్‌ను నిర్మించి రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాలతో పాటు నల్లగొండ జిల్లాకు సాగు నీరు అందించాలని నిర్ణయించారు. 2009లో కూడా మహబూబ్‌నగర్ ఎంపీగా పోటీ చేసిన కేసీఆర్ ఈ రిజర్వాయర్ గురించి పలు బహిరంగ సభల్లో హామీ ఇచ్చారు. 2014లో తెలంగాణ రావడం, టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారం చేపట్టడం కూడా జరిగింది. కేసీఆర్ పదేళ్ల ముఖ్యమంత్రిగా ఉన్నా రిజర్వాయర్ నిర్మాణానికి అడుగు కూడా ముందుకు పడలేదు. 2016లో మాత్రం అప్పటి మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ టీకే శ్రీదేవి లక్ష్మీదేవిపల్లిలో గ్రామసభ ఏర్పాటు చేసి భూసేకరణ కోసం రైతులను ఒప్పించారు. అప్పటి నుంచి ఈ రిజర్వాయర్ గురించి మాట్లాడినవారే లేరు. గతంలో రిజర్వాయర్ నిర్మాణం కోసం ప్రస్తుత ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో పాటు ప్రొఫెసర్ కోదండరాం, గద్దర్ ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ ఎం. రాఘవాచారి తదితరులు లక్ష్మీదేవిపల్లిలో ఆందోళన కూడా నిర్వహించారు.

సాగునీటి వనరులు లేక..

ఇబ్బందుల్లో రైతులు

షాద్‌నగర్‌లో నియోజకవర్గంలో వ్యవసాయానికి సంబంధించిన నీటి వనరులు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. బావులు, బోర్ల మీద ఆధారపడి పంటలు పండిస్తున్నారు. ఈ నేపథ్యంలో లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను పూర్తిచేసి సాగునీటిని అందించాలనే డిమాండ్ రైతుల నుంచి పెరిగింది. అయితే మొదట 10.08 టీఎంసీల నీటి సామర్థ్యం గల రిజర్వాయర్‌ను నిర్మించి పాలమూరు, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాలకు సాగునీటిని అందించాలనే యోచన ఉండేది. కానీ భూసేకరణలో ఇబ్బందులు తలెత్తుతాయనే ఉద్దేశంతో రిజర్వాయర్‌ను 2.8టీఎంసీల సామర్థ్యంతో నిర్మించి షాద్‌నగర్‌తో పాటు, చెవేళ్ల, పరిగి, వికారాబాద్ నియోజకవర్గాలకు మాత్రమే సాగునీరు అందించాలని నిర్ణయించారు. పరిమితం చేశారు. పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టులో భాగమైన లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ పనులు మహబూబ్‌నగర్ జిల్లాల్లోని ఉద్దండాపూర్, కరివెన వరకు వచ్చి నిలిచిపోయాయి. పదేళ్లు గడిచినా లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ పనులు అతీగతిలేకపోవడం రైతులు తీవ్ర నిరాశలో ఉన్నారు. కానీ 2025-2026 వార్షిక బడ్జెట్‌లో నీటి పారుదల శాఖకు రూ.23,373 కోట్లు కేటాయించడం, భట్టి లక్ష్మీదేవిపల్లి నిర్మాణం గురించి ప్రస్తావించడంతో రైతన్నల్లో మళ్లీ ఆశలు చిగురించాయి. బడ్జెట్ నిధుల నుంచి రిజర్వాయర్ నిర్మాణానికి ప్రాధాన్యతనిచ్చి పనులు చేపట్టాలని కోరుతున్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కృషి ఫలితంగానే రిజర్వాయర్ నిర్మాణానికి ముందడుగు పడిందని ప్రశంసిస్తున్నారు.

భట్టి మాటను స్వాగతిస్తున్నాం



అసెంబ్లీ బడ్జెట్ సమావేశంలో లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణం పనులను సత్వరమే ప్రారంభిస్తామని ఉప ముఖ్యమంత్రి భటి విక్రమార్క చేసిన వ్యాఖ్యలను స్వాగతిస్తున్నాం. మాటలకే పరిమితం కాకుండా సత్వరమే పనులు చేపట్టాలి. పాలమూరు, రంగారెడ్డిని రెండు భాగాలుగా చేపట్టి ఎగువ జూరాల, దిగువ శ్రీశైలం నుంచి రెండువైపులా లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను అనుసంధానం చేసి నీటిని విడుదల చేయాలి. రిజర్వాయర్ నిర్మాణం కోసం తామంతా మళ్లీ ఉద్యమాలు చేపట్టే అవకాశం ఇవ్వకూడదు. నీటి పారుదల రంగానికి కేటాయించిన నిధుల్లో మొదటి ప్రాధాన్యం లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి ఇవ్వాలి.

- ఎం.రాఘవాచారి, పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్

క్రైం కార్నర్

ఇచ్చిన డబ్బులు తిరిగి అడిగాడని..
కర్రలు, రాళ్లతో దాడి

- చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



సుధాకర్ (ఫైల్)

కందుకూరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): అప్పు ఇచ్చిన వ్యక్తి డబ్బులు అడిగాడని దాడి చేసి హ త్య చేసిన ఘటన కందుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని సరస్వతిగూడలో చోటుచేసుకుంది. బాధితులు ఫిర్యాదు, సీఐ సీతారాం కథనం ప్రకారం... మండలంలోని ధన్నారం గ్రామానికి చెందిన ఎం.నారాయణకు 30ఏళ్ల క్రితం సరస్వతిగూడకు చెందిన వసంతకు ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఇద్దరు కుమారులు. నారాయణకు ధన్నారంలో జీవనోపాధి లేకపోవడంతో సరస్వతిగూడలోని అత్తగారింట్లో కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్నాడు. నారాయణ పెద్ద కుమారుడు సుధాకర్(26), ఆటోడ్రైవర్. అదే గ్రామానికి చెందిన నల్ల శమంత అలియాస్ శశికళకు అతడు అవసరం నిమిత్తం డబ్బులు ఇచ్చాడు. ఈనెల 22న మధ్యాహ్నం సుధాకర్‌కు డబ్బులు అవసరం ఉండి శశికళ ఇంటికి వెళ్లి ఇవ్వాలని అడిగాడు. ఈక్రమంలో ఇద్దరూ గొడవ పడ్డారు. శశికళ తమ్ముళ్లు మాదరమోని శేఖర్, వినయ్‌లకు సమాచారం ఇచ్చింది. అనంతనం శశికళ వారితో కలిసి సుధాకర్‌పై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తనపై శశికళ అక్రమంగా కేసు పెట్టిందని సుధాకర్ తన తల్లి వసంతతో కలిసి సాయంత్రం 5గంటలకు కందుకూరు పోలీస్ స్టేషన్‌కు సుధాకర్ బైక్‌పై వస్తుండగా.. శశికళతో తనతో జరిగిన గొడవను మనసులో పెట్టుకొని తమ్ముళ్ల వినయ్, శేఖర్‌తో కలిసి మార్గమధ్యలోని లేమూరు సమీపంలో ఉన్న శ్మశానవాటిక వద్ద సుధాకర్ బైక్‌ను ముందుగా వినయ్ స్కూటీతో ఢీ కొట్టాడు. దాంతో వసంత రోడ్డుపై పడిపోయింది. అనంతరం శేఖర్, వినయ్‌లు సుధాకర్‌పై కర్రలు, రాళ్లతో సుధాకర్‌పై దాడిచేసి వెళ్లిపోయారు. కాగా, అతడి ముఖం గుర్తుపట్టలేని విధంగా ఉండడంతో ఎట్టకేలకు లేమూరు గ్రామస్తులు గుర్తించి సుధాకర్‌ను ఆస్పత్రికి తరలించడానికి అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. తుక్కుగూడలోని ప్రైమ్‌కేర్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సీతారాం తెలిపారు.

భగత్‌సింగ్ ఆశయ సాధనకు కృషి చేయాలి




యాచారం : సీపీఎం నాయకుల కొవ్వొత్తుల ర్యాలీ

యాచారం/మంచాల/షాద్‌నగర్/చేవెళ్ల/ఇబ్రహీంపట్నం/మహేశ్వరం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను తృణప్రాయంగా వదులుకున్న భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల ఆశయ సాధనకు యువకులు కృషి చేయాలని రంగారెడ్డి జిల్లా రైతు సంఘం కార్యదర్శి బి.మధుసూదన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం వారి వర్ధంతి సందర్భంగా యాచారం మండలం మాల్‌లో చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. సీపీఎం నాయకులు చందూనాయక్, థావ్‌నాయక్, తదితరులున్నారు. యాచారంలో సీపీఎం నాయకులు ఆలంపల్లి నర్సింహ, అంజయ్య, పెద్దయ్య తదితరులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. స్వాతంత్ర్య సమరంలో అలుపెరుగని పోరాటం చేసిన యోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లని సీపీఎం మంచాల మండల కమిటీ సభ్యుడు బుగ్గరాములు అన్నాడు. ఆరుట్ల బస్టాండు చౌరస్తాలో సీపీఎం ఆధ్వర్యంలో అమరవీరుల చిత్రపటాలకు నివాళులర్పించారు. పి.గోపాల్, బుచ్చయ్య, తరంగ్, తదితరులున్నారు. భగత్‌సింగ్ పోరాటం స్ఫూర్తిదాయకమని కాంగ్రెస్ రాష్ట్ర నేత విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. యువజన కాంగ్రెస్ అధ్వర్యంలో ఆరుట్లలో భగత్‌సింగ్ వర్ధంతిని నిర్వహించారు. నియోజకవర్గ అధ్యక్షుడు సికిందర్‌రెడ్డి, అశోక్ ముదిరాజ్, ముచ్చర్ల వెంకటేష్‌యాదవ్, రమేష్ తదితరులున్నారు. భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు అన్నారు. యూటీఎఫ్, ఎస్ఎఫ్ఐ, వ్యవసాయ కార్మిక సంఘం, గిరిజన సంఘం, జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో షాద్‌నగర్ పట్టణంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం విజయవంతమైంది. ఫరూఖ్‌నగర్ ఎంఈవో మనోహర్ మాట్లాడుతూ నేటి సమాజ పరిణామ క్రమంలో యువత మంచి మార్గంలో పయనించాలన్నారు. షాద్‌నగర్ ఎస్సైలు రామచంద్రయ్య, వెంకటేశ్వర్లు మాట్లాడుతూ స్వాతంత్రం కోసం ఎందరో మహనీయులు ప్రాణాలను అర్పించారని అన్నారు. యూటీఎఫ్ నేతలు చంద్రశేఖర్, బిజిలి సత్యం, రవి, శ్రీనివాసులు, రాములు, ప్రజా సంఘాల నాయకులు కురుమయ్య, వ్యాకాస, శ్రీను నాయక్, తదితరులున్నారు. ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్‌కుమార్ చేవెళ్ల పట్టణ కేంద్రంలోని భగత్‌సింగ్ విగ్రహం వద్ద నాయకులతో కలిసి నివాళులర్పించారు. దేవేందర్, సమీర్, చందు, చరణ్‌గౌడ్, మురారి, గాయత్రి, శిరీష, మౌనిక, కవిత ఉన్నారు. ఇబ్రహీంపట్నం మండలం తులేకలాన్‌లో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐల ఆధ్వర్యంలో 2కే రన్, వన్‌డే క్రికెట్ మ్యాచ్‌లను నిర్వహించారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లను భారత ప్రజలు ఏనాడూ మరువరని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు బి.సామేల్ అన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శంకర్, డివిజన్ కార్యదర్శి వంశీ, కిషన్, గణేష్, ప్రణయ్, వినయ్ తదితరులున్నారు. భగత్‌సింగ్ ఆశయాలను ప్రతీఒక్కరు ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని సీపీఐ మహేశ్వరం నియోజకవర్గం కార్యదర్శి బి.దత్తునాయక్ అన్నారు. మహేశ్వరంలో భగత్‌సింగ్ జీవిత చరిత్ర పుస్తకాలు పంపిణీ చేశారు. మనోహర్, రఘుపతి, తదితరులు పాల్గొన్నారు.



షాద్‌నగర్ : రక్తదానం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

మాజీ ఎంపీటీసీ
మృతి పట్ల ఎమ్మెల్యే నివాళి



తలకొండపల్లి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఖానాపూర్‌కు చెందిన మాజీ ఎంపీటీసీ గార్లపాటి సరిత కొంతకాలంగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతూ శనివారం అర్ధరాత్రి అస్వస్థతకు గురికావడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఖానాపూర్‌లో అంత్య క్రియలు నిర్వహించారు. మృతదేహాన్ని ఆదివారం ఎమ్మెల్యే నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీత నర్సింహ, మాజీ జడ్పీటీసీలు వెంకటేశ్, దశరథ్‌నాయక్, అనురాధ పత్యానాయక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు శ్రీనివాస్‌యాదవ్, నిర్మళా శ్రీశైలంగౌడ్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్ గుప్త, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు కాసు శ్రీనివాస్‌రెడ్డిలు సందర్శించి నివాళులర్పించారు. ఆమె భర్త గణేశ్‌గుప్త, కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఎంపీటీసీగా అందించిన సేవలను నాయకులు కొనియాడారు.